RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 269 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 6-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 269 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 6-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS



## విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్..

## సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు సమీక్ష

రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం

ప్రభుత్వ వాటాగా రూ.4 లక్షల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు

మూలపేట పోర్టు నుంచి రాజమండ్రి అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు అభివృద్ధి

ఏఐ డేటా సెంటర్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమీక్షా సమావేశంలో వీఈఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ తరువాయి 2లో..







## పీవీ సింధు క్రీడా అకాడమీకి భూమిపూజ చేసిన నారా లోకేశ్

విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీకి శ్రీకారం

భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్

అరిలోవ తోటగరువులో సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణం

అకాడమీ నమూనా, సౌకర్యాలను పరిశీలించిన మంత్రి

కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాశాఖ మంత్రి, టీడీపీ నేతలు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**

సాగర నగరం విశాఖపట్నం క్రీడా రంగంలో మరో కీలక ముందడుగు పడింది. భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఏర్పాటు చేస్తున్న 'సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శంకుస్థాపన చేశారు. అరిలోవ సమీపంలోని తోటగరువులో ఈ అకాడమీని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి తరువాయి 2లో..

## డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసం పార్లమెంటు ప్రత్యేక సెషన్!



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ వర్షాకాల తరువాయి 2లో..

## రాజకీయాల కోసం పిల్ దుర్వినియోగాన్ని అనుమతించం

డీఎస్సీపై వైకాపా ఎమ్మెల్సీ వ్యాజ్యంలో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

నోటీసులిచ్చేందుకు కూడా విముఖత

అభ్యర్థులను ప్రభుత్వం భయపెడితే 335 రిట్ పిటిషన్లు ఎలా వేయగలిగారు?: హైకోర్టు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**


మెగా డీఎస్సీ-2025లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ.. దానిపై సీబీఐతో విచారణ జరిపించాలంటూ పిల్ దాఖలు తరువాయి 2లో..

## అమరావతే ఏపీ ఆత్మగౌరవం.. జగన్ పాలనపై విరుచుకుపడ్డ హోంమంత్రి అనిత

అమరావతి పనులను పరిశీలించిన అనిత, కొండపల్లి శ్రీనివాస్

మూడు రాజధానుల పేరుతో ప్రజలను జగన్ మోసగించారన్న అనిత

**అమరావతి, సిటిజన్ టైమ్స్**



అమరావతి వేదికగా జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాష్ట్ర హోం మంత్రి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ఆత్మగౌరవం అమరావతిలోనే ప్రతిబింబిస్తున్నాయని తరువాయి 2లో..

## సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు గ్రీన్ సిగ్నల్

ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్

రూ.1 లక్ష పూచీకత్తుతో పాటు పలు షరతులు విధించిన ఏసీబీ కోర్టు

యూకే, అమెరికా, జర్మనీ, చైనా పర్యటనకు గ్రీన్ సిగ్నల్

సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్ట్ తిరిగి ఇవ్వాలని ఆదేశం



**తెలంగాణ, సిటిజన్ టైమ్స్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేసింది. సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, అధికారిక పర్యటన నిమిత్తం తన పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇవ్వాలని, విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం, పలు షరతులతో ఆయన విదేశీ పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆగస్టు 3న జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించవచ్చు. అయితే, ఈ పర్యటనకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. రూ.1 లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఒకరి హామీని సమర్పించాలని ఆదేశించింది. పర్యటన ప్రణాళిక, ఆయా దేశాల్లో బస చేసే వివరాలను కోర్టుకు అందించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు కేంద్ర విదేశాంగ శాఖ నుంచి రాజకీయపరమైన అనుమతి పొందాలని, పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక 2026 సెప్టెంబర్ 18 లోగా తన పాస్‌పోర్ట్‌ను తిరిగి కోర్టులో జమ చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. 2015లో నమోదైన ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి మొదటి నిందితుడిగా (ఏ1) ఉన్నారు. అప్పట్లో ఆయన టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డికి తరువాయి 2లో..




### మోదీ వీడియో తొలగింపు అంశం..

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రధాని మోదీ వీడియోను మెటా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ నుంచి కొంతసేపు తొలగించిన వ్యవహారంలో ఐటీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం బుధవారం ఆ సంస్థకు మూడురోజుల అల్టిమేటం జారీచేసింది. ఆ లోగా మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పి, బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. "ఈ వ్యవహారంలో బాధ్యులపై మెటా చర్యలు తీసుకోకపోతే.. చట్టబద్ధమైన రక్షణ కల్పించే క్లాజ్‌ను కోల్పోతారు. జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పాలి. లేకపోతే కేసు నమోదు అవుతుంది" అని పార్లమెంట్ స్థాయీ సంఘం హెచ్చరించింది. 140 కోట్లమంది భారతీయులకు ప్రతినిధి అయిన తరువాయి 2లో..

### 20నిమిషాల్లో 7పేలుళ్లు..

## దద్దరిల్లిన దుబాయ్

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

వరుస పేలుళ్లతో దుబాయ్ దద్దరిల్లింది. జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం రాత్రి భారీ పేలుళ్లు తరువాయి 2లో..



## సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట..



తరువాయి 2లో..

### పాఠశాల విద్యకే రూ.44,527 కోట్లు

కామరాజర్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు

10 వేల పాఠశాలల్లో సూపర్ క్లీన్ క్యాంపస్ పథకం

కళాశాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల కోసం రూ.2,000 కోట్లు

సంక్షేమ పథకాలకు భారీ నిధుల కేటాయింపు

అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టడమే లక్ష్యం

## ఎడిటోరియల్

# చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని తహతహ

ఏపీ రాజకీయాల్లో బ్యూరోక్రాట్ల పాత్ర చర్చనీయాంశం అవుతోంది. ఉద్యోగాలలో ఉన్నప్పుడు రాజకీయ నేతలతో చట్టాపట్టాలు వేసుకుని తిరిగిన అఖిలభారత సర్వీసు అధికారులు, విశ్రాంత జీవితంలో రాజకీయంగా తమ సత్తా చాటుకోవాలని భావిస్తున్నారు. ఇలా ఇప్పటికే కొందరు పాలిటిక్స్ లోకి ఎంట్రీ ఇచ్చి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేశారు. కొందరు విజయం సాధించి చట్టసభలలో అడుగు పెడితే మరికొందరు పరాజయంతో మళ్లీమళ్లీ తమ అదృష్టం పరీక్షించుకోవాలని చూస్తున్నారు. ఇక లేటెస్ట్ గా రిటైర్ అయిన ఏబీ వెంకటేశ్వరరావు వంటి వారు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటుండగా, ఈ నెలలో రిటైర్ కాబోయే మరో సీనియర్ అధికారి కూడా రాజకీయాల్లోకి వస్తానంటూ సంకేతాలు పంపుతున్నారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురు అఖిల భారత సర్వీసు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇలాంటి వారిలో పనిష్మెంట్ అనుభవిస్తూనే రిటైర్ అవుతున్నారు. సర్వీసు ముగిసిన సమయంలో కూడా ప్రభుత్వం తమపై కరుణ చూపడం లేదని ఆవేదనతో ఈ అధికారులు రగిలిపోతున్నారని చెబుతున్నారు. అంతేకాకుండా తమను అవమానకరంగా సర్వీసు నుంచి సాగనంపుతున్న ప్రభుత్వంపై ప్రతీకారం తీర్చుకోవాలని తహతహలాడుతున్నారని అంటున్నారు. ఇలాంటి వారిలో ఇద్దరు అధికారులు విపక్షం వైసీపీతో చేతులు కలినట్లు ప్రచారం జరుగుతోంది. వీరిలో ఒకరు ఇప్పటికే రిటైర్ కాగా, మరొకరు కొద్దిరోజుల్లో రిటైర్ కానున్నారని అంటున్నారు. ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్న ఆ అధికారి ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర వ్యతిరేకతతోనే రాజకీయాల్లోకి రావాలని భావిస్తున్నారని అంటున్నారు. కొద్దిరోజుల్లో సర్వీసు ముగుస్తుండటం వల్ల తనకు చేతనైన విధంగా ప్రభుత్వంపై పోరు సాగించాలని ఆ సీనియర్ అధికారి నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. లేనిపోని కేసులు బనాయించి తనను జైలులో పెట్టడమే కాకుండా, 30 ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన ప్రతిష్ఠను దెబ్బతీశారని ఆ అధికారి ఆవేదన చెందుతున్నారని అంటున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలను దెబ్బతీసేలా పావులు కదిపేందుకు ఆ అధికారి రంగంలోకి దిగారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం తాడేపల్లిలో ఓ ప్లాటు అద్దెకు తీసుకున్న సీనియర్ అధికారి, రాజకీయాల్లోకి వచ్చాక ఏం చేయాలి? ఎలా చేయాలి? ప్రభుత్వాన్ని ఇరుకన పెట్టే వ్యూహాలు ఏంటి? అన్న దిశగా చర్చలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక రాజకీయాల్లోకి రావాలని భావిస్తున్న సదరు అధికారి నేరుగా విపక్షం వైసీపీలో చేరి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలా? లేక తటస్థంగా ఉంటూ ప్రభుత్వ విధాన నిర్ణయాలపై గళం విప్పాలా? అనే విషయమై తర్జనభర్జనకు లోనవుతున్నట్లు చెబుతున్నారు. ఈ విషయమై తన అంతరంగాన్ని వైసీపీ అధిష్టానానికి తెలియజేశారని, అయితే పార్టీ పెద్దలు మాత్రం ఏ విషయంపై క్లారిటీ ఇవ్వలేదని అంటున్నారు. ఆ అధికారి విషయంలో పార్టీకి ఆసక్తి ఉన్నప్పటికీ, ఆయనను వినియోగించుకునే విషయంలో రకరకాల ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారని చెబుతున్నారు. ఏ విధంగా వ్యవహరిస్తే లాభం ఉంటుంది? నేరుగా పార్టీలో చేర్చుకోవడం ద్వారా లాభం ఉంటుందా? లేక తటస్థ వేదికపై నుంచి పోరాటానికి సాయం చేయడం ద్వారా పార్టీకి మేలు జరుగుతుందా? అనే విషయాలపై వైసీపీ హైకమాండ్ ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి సెప్టెంబరు నుంచి రాష్ట్ర రాజకీయాలలో వైసీపీ తరపున మరో గళం బలంగా వినిపించే అవకాశం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

### 20నిమిషాల్లో 7పేలుళ్లు..

# దద్దరిల్లిన దుబాయ్

చోటుచేసుకున్నాయి. కేవలం 20 నిమిషాల్లోనే 7 భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పేలుళ్ల కారణంగా పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. ఈ పారిశ్రామిక ప్రాంతం పక్కనే ప్రపంచంలోనే అతిపెద్ద నౌకాశ్రయం ఉంది. పేలుళ్ల అనంతరం దుబాయ్‌లోని ఓడరేవుకు ఆనుకుని ఉన్న ఇంధన నిల్వ, రవాణా కోసం ఉపయోగించే ఒక గిడ్డంగిలో మంటలు చెలరేగినట్లు ఉపగ్రహ చిత్రాలు చూపిస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పేలుళ్ల వెనక హూతీల హస్తం ఉందని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. యెమెన్ నుంచి ఈ క్షిపణి దాడులు జరిగినట్లు ఇరాక్ ఆరోపించింది. కాగా ఈ పేలుళ్లపై యూఏఈ అధికారిక ప్రకటన చేయలేదు.

# విశాఖలో పీవీ సింధు అకాడమీకి శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్...

రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం, పీవీ సింధు, క్రీడాశాఖ మంత్రితో కలిసి లోకేశ్ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి, నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం అకాడమీ భవన నమూనాను, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురానున్న అత్యాధునిక సౌకర్యాలను మంత్రి లోకేశ్ ఆసక్తిగా పరిశీలించారు. అకాడమీ లక్ష్యాలు, వసతుల గురించి సింధును అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టుపై రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ) ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, శాప్ ఎండీ భరణి, గ్రీన్ కో ఎనర్జీ డైరెక్టర్ చలమలశెట్టి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల కోసం పిల్ దుర్వినియోగాన్ని అనుమతించం

చేసిన వైకాపా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి హైకోర్టు షాకిచ్చింది. ఆ పిల్‌లో జోక్యానికి నిరాకరించింది. రిజర్వేషన్ కోటాను పెంచడంపై అభ్యంతరం ఉంటే అభ్యర్థులు మొదట్లోనే హైకోర్టును ఆశ్రయించేవారని, ఈ వ్యవహారంపై ఏ ఒక్కరూ ముందుకు రాలేదని గుర్తుచేసింది. క్రీడల కోటాతో నష్టపోయామనీ అభ్యర్థులెవరూ కోర్టుకు రాలేదని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) విచారణ నిమిత్తం పరిగణనలోకి తీసుకునే ప్రశ్నే ఉత్పన్నం కాదని తేల్చిచెప్పింది. 'పిల్ ఎంతో విలువైన ఆయుధం. రాజకీయ ప్రయోజనాల కోసం దానిని దుర్వినియోగం చేయడానికి వీల్లేదు' అని స్పష్టం చేసింది. బాధితులు కోర్టును ఆశ్రయించే పరిస్థితులు లేవని, అభ్యర్థులను ప్రభుత్వం భయపెడుతోందన్న పిటిషనర్ వాదనల్లో వాస్తవం లేదంది. ప్రభుత్వం భయపెడితే హైకోర్టులో వారు 335 రిట్ పిటిషన్లు ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించింది. బాధితుల అభ్యంతరాలను పరిశీలించేందుకు ప్రభుత్వం 'ఫిర్యాదుల పరిష్కార కమిటీ'ని ఏర్పాటు చేసిందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా క్రీడల్లో రిజర్వేషన్ కోటాను నిర్ణయించారని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ విధానమే లేకపోతే.. రాష్ట్ర ప్రభుత్వం ఆ విధంగా రిజర్వేషన్ కోటాను నిర్ణయించి ఉండేది కాదని వ్యాఖ్యానించింది. తన వాదనకు బలం చేకూరే ఆధారాలను పిటిషనర్ కోర్టు ముందుంచలేదని ఆక్షేపించింది. అక్రమ మార్గంలో ఉపాధ్యాయుల పోస్టులు పొందారని ఎవరిపై ఆరోపణ చేస్తున్నారో వారిని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఎందుకు చేర్చలేదని ప్రశ్నించింది. ప్రతివాదులకు నోటీసులు ఇవ్వడానికి సైతం ధర్మాసనం నిరాకరించింది. పిల్ విచారణార్హతపై అభ్యంతరం తెలిపింది. మీ కక్షిదారుతో మాట్లాడి వాదనలను కొనసాగిస్తారా, పిల్‌ను ఉపసంహరించుకుంటారా అనేది కోర్టుకు చెప్పాలని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్‌కు సూచించింది. అదనపు వివరాలను కోర్టు ముందుంచేందుకు సమయం కావాలని ఆయన కోరడంతో విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ మెడమల్లి బాలాజీలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

**క్రీడల కోటా అర్హతలను మార్చేశారు: పిటిషనర్**

తొలుత వైకాపా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. 'డీఎస్సీలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. దశాబ్దాలుగా 2శాతం ఉన్న స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి మార్చారు. క్రీడల కోటా విధానానికి చివరి నిమిషంలో మార్పులు చేశారు. ఎంపిక చేసుకున్న వారికి క్రీడల కోటా కింద ప్రయోజనం చేకూర్చేందుకు నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందు అర్హత పరీక్షకు మినహాయింపు ఇచ్చారు. ఆ జీవోపై వ్యతిరేకత రావడంతో ఉపసంహరించుకున్నారు. స్థానిక క్రీడల్లో పాల్గొన్న కొంతమందికీ ఉద్యోగాలిచ్చారు. హారిజాంటల్ రిజర్వేషన్ సక్రమంగా అమలు చేయలేదు. ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్ష నిర్వహణ ఒకే సంస్థ చేపట్టడంతో గోప్యత దెబ్బతింది. కొంతమంది అభ్యర్థులు చెప్పిన వివరాలు, సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన సమాచారం, జనబాహుళ్యంలో లభ్యమైన వివరాలతో పిల్ దాఖలు చేశాం. మెగా డీఎస్సీపై దుష్ప్రచారం చేసినా, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసినా బాధ్యులపై క్రిమినల్ కేసులు పెడతామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ హెచ్చరించారు. దీంతో బాధితులు కోర్టుకు రావడానికి భయపడుతున్నారు. ఉపాధ్యాయ నియామక ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు ఆర్థిక లావాదేవీలపై సంప్రదింపులు జరిగాయి. ఈ వ్యవహారంపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కృష్ణా జిల్లాకు చెందిన ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మొదటి ర్యాంక్ సాధించి ఎంపికైనట్లు పేర్కొని తర్వాత తొలగించారు. దీంతో ఆ వ్యక్తి హైకోర్టులో వ్యాజ్యం వేశారు. పిల్ వెనుక రాజకీయ కోణమేమీ లేదు. ప్రభుత్వం వాస్తవాలను తొక్కిపెడుతోంది. సీబీఐతో దర్యాప్తు చేయిస్తే నిజాలు బయటకొస్తాయి' అని వాదించారు.

**ఎంపిక వివరాలన్నీ ఆన్‌లైన్లో ఉన్నాయి: ఏజీ..:** రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. 'డీఎస్సీ విషయమై హైకోర్టులో మొత్తం 335 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. అందులో క్రీడల కోటాకు సంబంధించినవి 69. రెండు ప్రజాహిత వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయి. డీఎస్సీలో పారదర్శకంగా వ్యవహరించాం. ఎంపికకు సంబంధించిన డేటా మొత్తం ఆన్‌లైన్లో అందుబాటులో ఉంది. ఆ సమాచారాన్ని పరిశీలించకుండానే పిటిషనర్ పిల్ వేశారు. అభ్యర్థుల/బాధితుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్ 24న ఫిర్యాదుల పరిష్కార కమిటీని ఏర్పాటు చేసింది. 45 వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ జరిపి గ్రీవెన్స్ కమిటీ ముందుకెళ్లాలని పిటిషనర్లకు సూచించింది. అభ్యర్థులు ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించిన కమిటీ సమగ్ర ఉత్తర్వులు జారీచేసింది. వ్యాజ్యాలు హైకోర్టులో ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. బాధితులు కోర్టును ఆశ్రయించినప్పుడు ఈ పిల్‌కు విచారణార్హత ఉండదు' అన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. పిల్ విచారణార్హతపై పిటిషనర్‌తో మాట్లాడి ఏ విషయం చెప్పాలని న్యాయవాదికి సూచిస్తూ విచారణను వాయిదా వేసింది.

# సీఎం విజయ్ తొలి బడ్జెట్‌లో విద్యా రంగానికి పెద్దపీట..

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం లభించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి పాఠశాల విద్య కోసం రూ.44,527 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ఎన్.మారీ విల్సన్ ప్రకటించారు. 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం 'పెరుంతలైవర్ కామరాజర్ మోడల్ స్కూల్స్' పేరుతో ఆధునిక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యతో పాటు భోజనం, వసతి, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తారు. ఈ పథకానికి మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.125 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదలకు 'సూపర్ క్లీన్.. సూపర్ క్యాంపస్' పథకం కింద రూ.129 కోట్లు కేటాయించారు. తొలి దశలో 10 వేల ప్రభుత్వ పాఠశాలల్లో దీన్ని అమలు చేయనున్నారు. ఉన్నత విద్యనభ్యసించేవాళ్లకు 'వెట్రి ల్యాప్‌టాప్ పథకం' కింద ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసేందుకు రూ.2,000 కోట్లు కేటాయించారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే అవగాహన కార్యక్రమాలకు రూ.7 కోట్లు కేటాయించారు. సంక్షేమ పథకాలకూ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే పథకానికి రూ.560 కోట్లు కేటాయించింది. పెళ్లి రోజు వధువుకు ఎనిమిది గ్రాముల బంగారు నాణెం, పట్టు చీర అందించే పథకానికి రూ.812 కోట్లు ప్రతిపాదించింది. రాష్ట్ర అప్పులు గత ఐదేళ్లలో రెట్టింపు అయ్యాయని మంత్రి తెలిపారు. అదనంగా రూ.16 వేల కోట్ల ఆదాయం రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# మెటాకు 3 రోజుల అల్టిమేటం

ప్రధాని మోదీ షేర్ చేసిన వీడియోను తొలగించడం 'ప్రజాస్వామ్యంపై దాడి' లాంటిదేనని ప్యానెల్ పేర్కొంది. కాగా.. సేఫ్ హార్బర్ ప్రొటెక్షన్ క్లాజ్‌ను తొలగిస్తే.. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు చెందిన అధికారులపై నేరుగా కేసు నమోదు చేయడానికి అవకాశం లభిస్తుంది. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ దేశ రాజధాని దిల్లీలో విద్యార్థులు నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో అర్ధరాత్రి సమయంలో ప్రధాని మోదీ ఓ సెల్ఫీ వీడియోను ఇన్‌స్టాలో షేర్ చేశారు. "స్నేహితులారా.. పేపర్ లీక్ అనేది సాధారణ అంశం కాదని నాకు తెలుసు..' అంటూ సాగిన ఈ జెన్-జీ (+వల్గ) స్టైల్ సెల్ఫీ వీడియో నెట్టింట్లో వైరల్ అయింది. అయితే, ఇటీవల కొద్దిసేపు అది మోదీ సోషల్‌మీడియా ఖాతాలో కనిపించలేదు. తర్వాత అందుబాటులోకి వచ్చింది. కానీ, ఈ తొలగింపును కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. ఈ ఘటనకు సాంకేతిక లోపమే కారణమని చెబుతూ భారత ప్రభుత్వానికి మెటా క్షమాపణలు కోరింది. ఆ వివరణ సరిపోదని ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖ తెలిపింది. ఇది కేవలం సాంకేతిక అంశాలకు సంబంధించినది మాత్రమే కాదని, జాతీయ భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన వ్యవహారమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో మెటా అధినేత జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని పార్లమెంట్ ప్యానెల్ అధ్యక్షుడు నిశికాంత్ దుబే ఇప్పటికే డిమాండ్ చేశారు.

## మొదటి పేజీ తరువాయి

### విశాఖ రూపురేఖలు మార్చే మాస్టర్ ప్లాన్.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. 'బేసిటీ' ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా చేసుకుని విశాఖ రీజియన్ అభివృద్ధిని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. వీఈఆర్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని సూక్ష్మ స్థాయి ప్రణాళికతో సమగ్రాభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళిక మూలపేట పోర్టు నుంచి రాజమండ్రిలోని అఖండ గోదావరి ప్రాజెక్టు వరకు విస్తరించి ఉండాలని ఆయన సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (ఎ+ఫీ) స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు

# ఏసీబీ కోర్టు గ్రీన్ సిగ్నల్

అనుకూలంగా ఓటు వేయాలని నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు రూ.50 లక్షలు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై 2015 మే 31న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో దాదాపు నెల రోజుల పాటు జైలులో ఉన్న రేవంత్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ షరతుల్లో భాగంగా ఆయన తన పాస్‌పోర్ట్‌ను కోర్టుకు అప్పగించారు. విదేశాలకు వెళ్లాల్సి వస్తే ఏసీబీ కోర్టు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అప్పట్లో హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో రేవంత్ రెడ్డి, ఇతరులపై ఏసీబీ అధికారులు అవినీతి నిరోధక చట్టం, నేరపూరిత కుట్ర (ఐపీసీ 120బీ) కింద ఛార్జిషీట్ దాఖలు చేశారు. తనపై ఉన్న ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ దశలో ఉంది.

# డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసం పార్లమెంటు ప్రత్యేక సెషన్!

సమావేశాలు ఆగస్టు 13న ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఆగస్టు 17 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ప్రస్తుత సమావేశాలు ముగిసిన తర్వాత పార్లమెంట్‌ను నిరవధికంగా వాయిదా వేయకపోవచ్చని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రతిపాదిత సవరణలు ఆమోదం పొందేందుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అవసరమైన సంఖ్యా బలం సమకూరిన తర్వాత ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపాయి.

**రిజిజు అభ్యర్థనకు రాహుల్ నిరాకరణ..:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. బుధవారం ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాయిదా పడింది. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఆయన ఛాంబర్‌లో కలిశారు. డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులకు సహకరించాలని కోరారు. అయితే, కేంద్రమంత్రి అభ్యర్థనను కాంగ్రెస్ ఎంపీ తిరస్కరించారు. అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ, సీజేపీ నిరసనల్లో విద్యార్థులపై పోలీసుల దుశ్చర్యలపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన వెలువడే వరకు సభలో ఎలాంటి కార్యకలాపాలు జరగబోవని రాహుల్ స్పష్టం చేశారు. దీంతో పార్లమెంట్ ప్రతిష్టంభనపై చర్చించేందుకు కిరణ్ రిజిజు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, హోం మంత్రి అమిత్ షాతో సమావేశమైనట్లు సమాచారం.

# అమరావతే ఏపీ ఆత్మగౌరవం..

మంత్రులు స్పష్టం చేశారు. ఈరోజు రాజధాని పనుల పురోగతిని దగ్గరుండి పరిశీలించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ మూడు రాజధానుల పేరుతో సమయాన్ని వృథా చేస్తూ ప్రజలను మోసగించారని అనిత తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న అద్భుతమైన నిర్మాణాలను ప్రజాప్రతినిధులతో పాటు సామాన్య ప్రజలంతా వచ్చి చూడాలని పిలుపునిచ్చారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... రాజధాని నిర్మాణం కోసం తమ భూములను అందించిన రైతుల త్యాగాలు మరవలేనివని గుర్తుచేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో 'వాక్ టూ వర్క్' అనే వినూత్న కాన్సెప్ట్‌తో సెక్రటేరియట్, హెచ్ఓడీ భవనాలను నిర్మిస్తున్నారని, నివాస సముదాయాల నుంచి నడుచుకుంటూ వెళ్లి పనిచేసుకునేలా ఆధునిక వసతులతో ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తున్నారని తెలిపారు.

# కూటమి పాలనలో భ్రష్టుపట్టిన వ్యవస్థలు

## కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ పాలన, అవినీతి విలయతాండవం –మంత్రి లోకేష్ ఆధిపత్యంతో బీజేపీ, జనసేన ప్రతిష్టకు దెబ్బ

## 'ధింసా' రికార్డు పేరిట గిరిజనులను మోసం చేశారు.. చంద్రబాబు, లోకేష్ క్షమాపణ చెప్పాలి

## సకల శాఖా మంత్రిగా లోకేష్.. విశాఖలో 'తెలుగు శక్తి' ధ్వజం

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 05**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిపాలనా వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందని, స్వంత శాఖపై కనీస పట్టు లేని మంత్రి నారా లోకేష్ సంబంధం లేని శాఖలపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని 'తెలుగు శక్తి' అధ్యక్షులు బి.వి.రామ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఉదయం విశాఖపట్నంలోని హోటల్ మేఘాలయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అంతా "లోకేషుడు.. నాయుడు గారి తాలుకా" అన్నట్లే సాగుతోందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి కేవలం ప్రచార ఆర్భాటాలు, రంగుల ప్రకటనలపై ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాథమిక వసతులు, సమస్యల పరిష్కారంపై లేకపోవడం కూటమి ప్రభుత్వ ఉదాసీనతకు అద్దం పడుతోందని రామ్ విమర్శించారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాల్లో ఆయా శాఖల మంత్రులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు, ఎమ్మెల్యేలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా నిబంధనలను విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ తీరు వల్ల కూటమి భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, జనసేన ప్రతిష్టలకు తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. ఎలాంటి సంబంధం లేకపోయినా విశాఖలో ఆయన శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక భోగాపురం ఎయిర్‌పోర్టుకు కర్త, కర్మ, క్రియ అంతా తానేలా



ముఖ్యమంత్రి చంద్రబాబు బోగస్ మాటలు మాట్లాడుతున్నారని, ప్రభుత్వ రికార్డులను వక్రీకరించి క్రెడిట్ చోరీ చేయాలని చూస్తే ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఏఐ డేటా సెంటర్లపై వ్యతిరేకత పెరుగుతుంటే, ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు అంటూ కూటమి ప్రభుత్వం అసత్య ప్రచారాలు చేస్తోందని మండపడ్డారు. ధైర్యముంటే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని మంత్రి లోకేష్‌కు సవాల్ విసిరారు. రాష్ట్రంలో లోకేష్ 'రెడ్‌బుక్ పాలన' సాగిస్తూ ఒకపక్క హింసను, మరోపక్క అవినీతిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.

**'ధింసా' పేరిట గిరిజనులకు మోసం.. గిన్నిస్ రికార్డు హాస్యాస్పదం:** భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవం సందర్భంగా 13 వేల మంది గిరిజన బాలికలతో ధింసా నృత్యం పేరిట రూ. 30 కోట్లు దారి మళ్లించి గిరిజనులను, ప్రజలను ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని బి.వి.రామ్ ఆరోపించారు. అసలు అక్కడ పాల్గొన్నది కేవలం 4,000 మంది బాలికలేనని, అలాంటిది 13 వేల మంది అని ప్రచారం చేసుకుని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఆ 30 కోట్లతో గిరిజన ప్రాంతాలకు ఒరిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలు నిజమే అయితే, ధింసా నృత్యంలో పాల్గొన్న ఆ 13 వేల మంది బాలికల ఆధార్ కార్డులను తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సంస్కృతిని, వారి భావోద్వేగాలను ప్రచారానికి వాడుకుని మోసం చేసినందుకు గాను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ గిరిజన సమాజానికి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని 'తెలుగు శక్తి' తరఫున బి.వి.రామ్ డిమాండ్ చేశారు.

# విశాఖకు ఏం చేశారో చెప్పలేని స్థితిలో బీజేపీ

## జగన్ మురారి తీవ్ర వ్యాఖ్యలు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 05**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గడచిన 12 ఏళ్లలో విశాఖపట్నం జిల్లా అభివృద్ధికి కేటాయించిన నిధులు, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ నాయకుడు జగన్ మురారి డిమాండ్ చేశారు. ఈ విషయమై బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుకు తాము విసిరిన సవాలుకు ఆయన వద్ద సమాధానం లేక మౌనం దాలుస్తున్నారని ఎద్దేవా చేశారు. విశాఖకు కేంద్రం చేసిన మేలేమీ లేకపోవడం వల్లే బీజేపీ నాయకులు ప్రజలను గాలి మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇదే క్రమంలో విశాఖ డైరీ వ్యవహారంపైనా ఆయన సంచలన ఆరోపణలు చేశారు. విశాఖ డైరీలో జరిగిన భారీ అవకతవకలపై పాడి రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారని, దీనిపై అసెంబ్లీ స్పీకర్ నాయకత్వంలో నిజనిర్ధారణ కమిటీని నియమించగానే ఆడారి ఆనంద్ రక్షణ కోసం బీజేపీ గూటికి చేరారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఆయనకు వెంటనే రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని కట్టబెట్టి, చట్టపరమైన చర్యల నుంచి కాపాడే రక్షణ కవచంగా మారారని విమర్శించారు. పార్టీలో చేరిన నాటి నుంచి ఆడారి ఆనంద్ ప్రజాక్షేత్రంలో గానీ, పార్టీ కార్యక్రమాల్లో గానీ కనిపించకుండా ముఖం చాటేస్తున్నారని జగన్ మురారి ఆరోపించారు. అవినీతికి పాల్పడిన వారికి బీజేపీ అడ్డాగా మారుతోందనడానికి ఈ సంఘటనే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# అనకాపల్లి నూతన జిల్లా విద్యాశాఖాధికారి జి.జి.ఎస్. నాగేశ్వరరావు కి ఘన సన్మానం



**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగస్టు 5:**

భీమునిపట్నంలో డైట్ కాలేజీ లో సీనియర్ లెక్చరర్‌గా, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా విశిష్ట సేవలందించిన జి.జి.ఎస్. నాగేశ్వరరావు ఇటీవల అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి (డి ఈ ఓ )గా నియమితులైన సందర్భంగా డైట్ కాలేజీ అధ్యాపక బృందం, నాన్–టీచింగ్ సిబ్బంది, డి.ఎల్.ఎడ్. విద్యార్థుల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా డైట్ కాలేజీ భీమునిపట్నంలో సీనియర్ లెక్చరర్‌గా, అనంతరం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నాగేశ్వరరావు సంస్థ అభివృద్ధికి, ఉపాధ్యాయ విద్యా నాణ్యత పెంపునకు, విద్యార్థుల శ్రేయస్సుకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన నాయకత్వం, క్రమశిక్షణ, అంకితభావం, విద్యారంగంపై ఉన్న నిబద్ధత అందరికీ ఆదర్శప్రాయమని ప్రశంసించారు. సన్మానానికి స్పందించిన జి.జి.ఎస్. నాగేశ్వరరావు డైట్ కుటుంబ సభ్యులు అందించిన ఆప్యాయత, గౌరవానికి కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి జిల్లా విద్యా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, డైట్‌తో తన అనుబంధం చిరకాలం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ అధ్యాపకులు బి. సునీత, షేక్ అల్లాద్దీన్, ఇతర అధ్యాపకులు, నాన్–టీచింగ్ సిబ్బంది, డి.ఎల్.ఎడ్. విద్యార్థులు పాల్గొని నాగేశ్వరరావు కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తల్లి పాలే బిడ్డకు శ్రీ రామ రక్ష...

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఆగస్టు 5:**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాలలో అగన్వాడి కేంద్రంలలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించినారు. ముఖ్య అతిథిగా రాజోలు ఐ సి డి ఎస్ సి డి పి ఓ ఇందిర పాల్గొనినారు. ఆమె మాట్లాడుచూ పుట్టిన వెంటనే ముర్రే పాలు పట్టాలన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, 6 నెలలు తప్పని సరిగా తల్లి పాలు ఇవ్వాలని, 7 నెల నుండి అనుబంధ ఆహారంతో పాటు తల్లి పాలు పట్టాలని, పాలిచ్చు తల్లులకు మంచి పోషక ఆహారంతో పాటు పరిశు భ్రత పాటించాలని తెలిపారు. తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని గోడ పత్రిక విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయ భారతి, కే వెంకటలక్ష్మి, అనిత, గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



# తల్లిపాలే శిశువుకు అమృతం...!!

## -నవీన్ జ్ఞానేశ్వర్ పిలుపు




**ఆనందపురం,సిటిజన్ టైమ్స్, ఆగష్టు 05:**

శిశువు ఆరోగ్యవంతమైన జీవనానికి తల్లిపాలే తొలి ఆహారం, తొలి రక్షణ కవచమని వేములవలస మాజీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆయన బుధవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించడం వెనుక ఉద్దేశం తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించడమేనని ఆయన తెలిపారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి ఆరోగ్యకరమైన శారీరక, మానసిక వికాసానికి బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మాతా––శిశు ఆసుపత్రుల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల అవసరాన్ని వివరించడం ఎంతో అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాధాన్యాన్ని చేరవేయాలని సూచించారు. శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం అత్యంత ముఖ్యమని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు సహజసిద్ధంగా అందుతాయని నవీన్ జ్ఞానేశ్వర్ వివరించారు. తల్లిపాలు శిశువుకు మాత్రమే కాకుండా తల్లి ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తాయని, తల్లి––శిశువుల మధ్య భావోద్వేగ అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి, ప్రతి బాలింతకు కుటుంబ సభ్యులు సహకారం అందించే వాతావరణం కల్పించాలని కోరారు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువుకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే దిశగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు.

# ఉత్తమ సహకార సంఘంగా ఆనందపురం...!!




**ఆనందపురం. సిటిజన్ టైమ్స్, ఆగష్టు 05:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకర బ్యాంకు 63వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని 99 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఆనందపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉత్తమ పనితీరు కనబరిచిన సంఘంగా తొలి బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా సంఘానికి ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు దక్కడానికి సహకరించిన భీమిలి శాసనసభ్యులు గంట శ్రీనివాసరావు, విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు కోన తాతారావు, బ్యాంకు ప్రధాన కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్. వర్మ, జిల్లా సహకార అధికారి టి. ప్రవీణ, డివిజనల్ సహకార అధికారి పి.ఎన్.ఎల్. కిరణ్ కుమారి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు, ఉప ప్రధాన నిర్వాహకుడు ఎం. అశోక్ కుమార్, ఆనందపురం శాఖ మేనేజర్, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సంఘ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన సంఘ కార్యదర్శి ఎస్. నారాయణరావు, ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు, రైతు మిత్రులు, సహకార సంఘ సభ్యుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

# అనకాపల్లి అభివృద్ధి పనులకు మరింత వేగం

## ప్రతిష్టాత్మక వీఎంఆర్డీఏ ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలి

## కొడూరు మాస్టర్ ప్లాన్ రోడ్డు –– కొత్తూరు సిటీ లెవల్ పార్కు పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 5:**

అనకాపల్లి పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో కూడిన అభివృద్ధి నగరంగా తీర్చిదిద్దేందుకు వీఎంఆర్డీఏ చేపడుతున్న ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, విశ్రాంతి వేదికలు, పచ్చదనం కలిగిన పట్టణ వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం కొడూరు మాస్టర్ ప్లాన్ రోడ్డు, కొత్తూరు సిటీ లెవల్ పార్కు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముందుగా కొడూరు ప్రాంతంలో వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో రూ.9.68 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. సుమారు 2.1 కిలోమీటర్ల పొడవు, 30 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఈ రహదారి అనకాపల్లి పట్టణ అభివృద్ధికి కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రహదారి నిర్మాణం, బీటీ రోడ్డు పనులు, ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ వ్యవస్థ, నాలుగు కల్వర్టుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. మిగిలిన సివిల్ పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాల్లో ఎలాంటి రాజీ లేకుండా ఆగస్టు 2026 చివరి నాటికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే పట్టణ ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు పరిశ్రమలు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం ఏర్పడి స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కొత్తూరు ప్రాంతంలో వీఎంఆర్డీఏ రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో 5.38 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న సిటీ లెవల్ పార్కును పరిశీలించారు. పార్కులో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్‌లు, చిన్నారుల ఆట స్థలాలు, పచ్చదనం, ల్యాండ్‌స్కేపింగ్, విశ్రాంతి ప్రాంతాలు, నీటి సరఫరా సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కును అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసి నిర్ణీత గడువులో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో నాణ్యత, పారదర్శకత, వేగం అనే మూడు అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ రోజువారీ పర్యవేక్షణతో పూర్తి చేసి, నిర్ణయించిన గడువును తప్పకుండా పాటించాలని వీఎంఆర్డీఏ ఇంజినీరింగ్ బృందానికి సూచించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ సూపరింటెండింగ్ ఇంజనీర్, జిల్లా సమన్వయ అధికారి (డీసీఓ), ఆర్డీఓ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు పనుల పురోగతి, పెండింగ్ సివిల్ పనులు, సాంకేతిక అంశాలపై వివరాలు తెలియజేశారు.

# భీమిలి మండలం చేపల తిమ్మాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం – ఇద్దరు మృతి

**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగష్టు 05**



భీమిలి మండలం చేపల తిమ్మాపురం వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. విశాఖపట్నం నుండి డ్యూక్ బైక్ పై వస్తున్న ఇద్దరు యువకులు ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపు తప్పి కారును బలంగా ఢీకొట్టారు ఈ క్రమంలోనే బైక్ రోడ్డుపై నడుస్తున్న మహిళను బలంగా ఢీకొట్టి కాలువలో కి బైకు దూసుకుపోయింది ఈ ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న గ్రంధి సూరి(28) విజయనగరం జిల్లా జామి మండలానికి చెందిన యువకుడు సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చేపల తిమ్మాపురం గ్రామానికి చెందిన కాసురపు కృష్ణవేణి(43)ను స్థానికులు గీతం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె కూడా మృతి చెందినట్లు ప తెలిపారు. బైక్ నడుపుతున్న మరో యువకుడికి తీవ్రమైన గాయాలైనట్లు తెలిపారు సమాచారం అందుకున్న భీమిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు మృతదేహాలను భీమిలి సిహెచ్ కి తరలించారు.

# డిగ్రీ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం

## క్రమశిక్షణ, నైపుణ్యాలతో రాణించాలని ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి సూచన






**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్ ఆగస్టు 5**

నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి కొత్తగా చేరిన తొలి సంవత్సరం విద్యార్థుల కోసం బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో ఉన్నత విద్యపై అవగాహన పెంపొందించడంతో పాటు కళాశాల విద్యా విధానం, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసంపై దిశానిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి ముఖ్య అతిథిగా, కీనోట్ స్పీకర్‌గా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, పుస్తక విజ్ఞానంతో పాటు సంభాషణ నైపుణ్యాలు, డిజిటల్ పరిజ్ఞానం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని ఆమె అన్నారు. కళాశాలలో అందుబాటులో ఉన్న గ్రంథాలయం, ప్రయోగశాలలు, కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు వంటి అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. జాతీయ సేవా పథకం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజంపై బాధ్యతాయుత దృక్పథం, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. సమయపాలన, క్రమశిక్షణ, నిరంతర అధ్యయనం విద్యార్థులను విజయపథంలో నడిపిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ అధ్యక్షత వహించారు. ఓరియంటేషన్‌లో అందించిన సూచనలను విద్యార్థులు ఆచరణలో పెట్టుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అధ్యాపకుల మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి. వనిత, అధ్యాపకులు అంజయ్య, ఉమాదేవి, కోదండరాములు, రామకృష్ణ, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది, తొలి సంవత్సరం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీఎస్సీపై నేడు వైకాపా రిలే దీక్షలు..!!



**ఆనందపురం. సిటిజన్ టైమ్స్ ఆగష్టు 05**

డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు ఆనందపురం మండలం వేములవలస జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమాన్ని పార్టీ విద్యార్థి, యువజన, సామాజిక మాధ్యమ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త ముజ్జి శ్రీనివాసరావు పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించలేదని, అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# భీమ్లీ మండలంలో ఘనంగా 'ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ మేలా



**భీమిలి రూరల్ సిటిజెన్ టైమ్స్ ఆగష్టు 05:**

ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవంలో భాగంగా భీమ్లీ మండలం, టీ. నగర్‌పాలెం గ్రామంలో "ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ మేలా 2026–27" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా ఆయిల్ పామ్ మొక్కలను నాటడం జరిగింది. ఈ మేలాలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఉద్యాన శాఖ (హార్టికల్చర్) అధికారిణి వాకా .భాను పుష్పలీలావతి, ఇంచార్జ్ వాసంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ... ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని, పంట విస్తరణకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ప్రతీ ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో ఆయిల్ పామ్ తోటల సాగును మరింత పెంచేందుకు ఉద్యాన శాఖ ద్వారా పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ నాయకులు, రైతు సోదరులు మరియు ఉద్యాన శాఖ సిబ్బంది విశేషంగా పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌లో పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం /మంగళగిరి సిటిజన్ టైమ్స్ ఆగష్టు 5**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులను మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజల సమస్యలను ఓర్పుగా విని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్నాయని, ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించడం ద్వారా సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.



# స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ హరీష్ బాలయోగి




**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగష్టు 5**

పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా, ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్మిక, వస్త్ర, నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి హాజరయ్యారు. జౌళి రంగం వృద్ధి, పోటీతత్వం, సామర్థ్య పెంపునకు సంబంధించిన కీలక అంశాలపై ఈ కమిటీ చర్చలు జరిపింది. జౌళి, కార్మిక, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి పారిశ్రామికవేత్తల అభివృద్ధి మంత్రిత్వ శాఖలకు సంబంధించిన ముఖ్యమైన నివేదికలను పరిశీలించి ఆమోదించినట్లు ఎంపీ హరీష్ తెలిపారు.

# పీజీఐలో రాష్ట్రంలో తొలి స్థానమే లక్ష్యం

## 2026-27లో 445 పాయింట్లు సాధించాలి




**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్ ఆగస్టు 5**

విద్యా రంగంలో రాష్ట్రంలో తొలి స్థానం సాధించడమే లక్ష్యంగా నాగర్‌కర్నూల్ జిల్లాను ముందుకు తీసుకెళ్తామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. 2026–27 విద్యా సంవత్సరంలో 445 పాయింట్లు సాధించి నాగర్‌కర్నూల్‌ను నంబర్–1 జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత ఏడాది 333 పాయింట్లతో రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచిన నాగర్‌కర్నూల్ జిల్లా ఈసారి అగ్రస్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల పురోగతే జిల్లా విజయానికి పునాది అని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యా నాణ్యత, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలు, డిజిటల్ బోధనను బలోపేతం చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్, ప్రయోగశాలలు, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి మండలం, ప్రతి పాఠశాలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. వెనుకబడిన పాఠశాలలను గుర్తించి ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రతి నెల పురోగతిని సమీక్షించి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యారంగ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# ఆగస్టు 7న విశాఖలో భారీ ఉద్యోగ మేళా

## నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 05:**

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం (టెక్నికల్ ఌ క్లరికల్), నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి ఓ ప్రకటనలో తెలిపారు. కంచరపాలెంలోని గర్ల్స్ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయ సముదాయంలో ఉదయం 10 గంటల నుంచి ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని తెలిపారు. ఈ మేళాలో టీసీఐ, ఇన్నోవ్ సోర్స్ (ఎస్‌బీఐ కార్డ్స్), నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్, అపోలో ఫార్మసీ, ఫ్లిప్‌కార్ట్ ఌ డీమార్ట్, ఫాక్స్‌కాన్, గ్లోరీ వెండర్ టెలికాలర్స్, శుభగృహ, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపిటోరియా తదితర సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. అసిస్టెంట్ సూపర్వైజర్, సేల్స్ మేనేజర్, క్యాషియర్, లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్, ఫార్మసిస్ట్, టెలికాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఐఫోన్ అసెంబ్లింగ్ ఆపరేటర్, జూనియర్ కెమిస్ట్, ప్రొడక్షన్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలకు నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇతర అర్హతలు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. ఈ మేళా ద్వారా యువతకు మెరుగైన వేతనాలతో పాటు కెరీర్ అభివృద్ధి అవకాశాలు లభిస్తాయని, జిల్లాలోని నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పిలుపునిచ్చారు. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9160888066 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.




# వ్యర్థాల నుంచి సంపద సృష్టి

## జిల్లాలో 4 బయోగ్యాస్ ప్రాజెక్టుల ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**




గ్రామీణ ప్రాంతాల్లో పశువుల పేడ, వ్యవసాయ, వంటశాల (కిచెన్) వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ,వ్యర్థాల నుంచి సంపద సృష్టించే దిశగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొ రేషన్ ద్వారా జిల్లాలో నాలుగు ప్రత్యేక బయో గ్యాస్ ప్రాజెక్టులను ప్రతిపాదించినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, మున్సిపల్, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో ఈ ప్రతిపాదిత ప్రాజెక్టులపై సాధ్యసాధ్యాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం మరియు బహి రంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పేరుకు పోకుండా నివారించడం ద్వారా స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ దశ లక్ష్యాలకు ఈ ప్రాజెక్టులు ఎంతో మద్దతు ఇస్తాయని పేర్కొన్నారు.? ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే బయో గ్యాస్,గోబర్ గ్యాస్ పునరుత్పాదక శక్తిగా మారి, గ్రామీణ కుటుంబాలకు వంట ఇతర అవసరాలకు తక్కువ ధరకే లభిస్తుందన్నారు. ప్రతిపాదిత నాలుగు ప్రాజెక్టుల్లో భాగంగా స్థానిక జేఎన్టీయూ పరి ధిలో తగిన స్థలాన్ని గుర్తించడం జరిగిందన్నారు. పిఠాపురం పాదగయ వద్ద మున్సిపాలిటీ వ్యర్థాలను అనుసంధానం (టైఅప్) చేసుకుని యూనిట్లను నిర్వ హించేందుకు చర్యలు చేపడతామన్నారు. అన్నవరంలో కొండ కింది భాగంలో ఉన్న పశువుల శాల నుంచి పేడను సేకరించి,కిచెన్ వ్యర్థాలు మరియు వ్యర్థ అరటి ఆకులతో యూనిట్ ఏర్పా టు చేసి సేంద్రీయ ఎరువు తయారీతో పాటు పవర్ జనరేషన్‌కు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.??రైతులు తమ వద్ద ఉన్న పశువుల వ్యర్థాలను విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. గోబర్ధన్ పథకం ద్వారా బయోగ్యాస్ ప్లాంట్ల నుంచి తయారయ్యే అత్యంత నాణ్యమైన ప్రాకృతిక సేంద్రీయ ఎరువు భూసారాన్ని రక్షించడంతో పాటు,రసాయన ఎరువుల పై రైతుల ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గిస్తుందన్నారు.. అంతేకాకుండా, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, కాలుష్య నివారణకు ఈ విధానం ఎంతగానో దోహద పడు తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మనోజ్ కుమార్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఇ. మహమ్మద్ అబ్దుల్ మతిన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# మండలంలో స్థానిక సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటన... ఎమ్మెల్యే దేవ...





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఆగస్టు 5:**

డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలంలో అంతర్వేదిపాలెం మర్లకొడప (గున్నాలు), అంతర్వేదికర దిండకొడప ప్రాంతాల్లో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ క్షేత్ర స్థాయిలో పర్యటించి, స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అంతర్వేదిపాలెం గ్రామంలోని చింతా వారి తూము, భీరా వారి గ్రూప్, కట్టా వారి గ్రూప్, మర్లకొడప ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే దేవ రహదారులు, విద్యుత్ సౌకర్యాలు, డ్రైనేజీతో పాటు ఇతర మౌలిక వసతుల సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంతర్వేది కర గ్రామంలోని దిండకొడప ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే దేవ అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సరఫరా, రహదారుల సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి నరసింహారావు, గుబ్బల ఫణి, మలే నగేష్, పి కిషోర్, ఎన్డీఏ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ

### కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, ఆగష్టు 05**

ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, కాలనీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సీఎంసీ కమిషనర్ జి.సృజనతో కలిసి పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్‌ప్లాన్ నిధులను సమర్థవంతంగా వినియోగించి కాలనీల్లో రోడ్లు, శ్మశాన వాటికలు, అప్రోచ్ రోడ్లు, ఫంక్షన్ హాళ్లు వంటి సౌకర్యాలు మెరుగుపరచాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, బీమా సౌకర్యం కల్పించడంతో పాటు శాశ్వత, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆరోగ్య బీమా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీధి వ్యాపారులకు సహాయం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు అభివృద్ధి పనుల టెండర్లలో రిజర్వేషన్ నిబంధనలు, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ, రోస్టర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## జెడ్పీ గ్రౌండ్‌లో అండర్-18 రన్నింగ్ శిక్షణ

### క్రీడాకారులకు చైర్మన్ సునేంద్ర సూచనలు





**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్ ఆగస్టు 5**

నాగర్‌కర్నూల్ జెడ్పీ గ్రౌండ్‌లో అండర్-18 రన్నింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ హాజరయ్యారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. నిరంతర సాధనతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని యువ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. క్రీడాకారులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రన్నింగ్ కోచ్ మల్లేష్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ ఎం.డి. నిజాం, క్రీడాకారులు, యువత, అభిమానులు పాల్గొన్నారు.

## రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**సూరప్ప గూడెం: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 05:**

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏపీ భూమి హక్కులు మరియు పట్టాదారు పాసుపుస్తకాల చట్టం-- 1971 ప్రకారం రీసర్వే పూర్తైన గ్రామాల్లో రాజకీయ పార్టీ చిహ్నాలు, పేర్లు తొలగించి ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ప్రభుత్వం జారీ చేస్తోంది. ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు మండలం సూరప్పగూడెం గ్రామంలో రైతులకు మంజూరైన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను బుధవారం ఉదయం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజురెవెన్యూ శాఖ వారి ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన ఫోటోను పట్టాదారు పాస్ పుస్తకాలపై ముద్రించి, ప్రజల ఆస్తిని తన వ్యక్తిగత ఆస్తిలా భావించిన తీరు రైతులను, ప్రజలను తీవ్రంగా బాధించింది. అందుకే రైతులే తిరగబడ్డారాన్నారు. గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే, అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఈరోజు నెరవేర్చింది. ఇది రైతుల పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండలం జనసేన, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు, తహసీల్దార్, సూరప్పగూడెం గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రెవిన్యూ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### సైబర్ క్రైమ్ పోస్టర్ల ఆవిష్కరణ




**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్ ఆగస్టు 5**

సైబర్ జాగృత్ దివస్ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్లను జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్యాంకర్లు, వివిధ అసోసియేషన్ల సభ్యులు, సైబర్ బాధితులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఇన్‌పర్సోనేషన్, కార్డు మోసాలు, ఈ-కామర్స్ మోసాలు, పెట్టుబడుల పేరిట మోసాలు, నకిలీ లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఉద్యోగాల పేరుతో జరుగుతున్న జాబ్ మోసాల పట్ల నిరుద్యోగులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వొద్దని ప్రజలకు సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే ఓ1930 హెల్ప్‌లైన్‌లికు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సమీప పోలీస్ స్టేషన్‌లోని సైబర్ క్రైమ్ వారియర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ మోసం జరిగిన వెంటనే సంబంధిత బ్యాంకు టోల్‌ఫ్రీ నంబర్‌కు కూడా సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి బ్యాంకు, ప్రతి సంస్థలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని బ్యాంకర్లు, అసోసియేషన్ ప్రతినిధులకు ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాల్గొనేవారంతా 'సైబర్ మోసాల బారిన పడబోమని' ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ అధికారులు, జిల్లా పోలీసు సిబ్బంది, సైబర్ క్రైమ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిచే పాస్ పుస్తకాలు పంపిణీ

### రైతు సంక్షేమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

**ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 5 సిటిజన్ టైమ్స్**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రెవెన్యూ శాఖలో సమూల ప్రక్షాళన చేపట్టిందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు.అన్నమయ్య జిల్లా కలికిరి మండలం కె.రెడ్డివారిపల్లి గ్రామంలో 1256 మంది రైతులకు రాజముద్రతో కూడిన నూతన పాస్ బుక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పాస్ బుక్కులు, నెంబర్ రాళ్లపై సొంత ఫోటోలు ముద్రించుకొని ప్రచార ఆర్భాటానికే పరిమితమయ్యారని విమర్శించారు. సర్వేలు చేపట్టకుండా, రైతుల సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేశారని ఆరోపించారు.చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వే చేపట్టి, రైతుకు చెందిన భూముల వివరాలను స్పష్టంగా పాస్ బుక్కులో నమోదు చేసి రాజముద్రతో అందజేస్తోందని తెలిపారు. ఇదే నిజమైన పాలనకు, రైతు సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు.చంద్రబాబు నాయకత్వంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతులకు అండగా ఉంటూ, పీలేరు




నియోజకవర్గ అభివృద్ధి కి ఆదర్శంగా నిలుపుతారని, సమస్యలు లేని నియోజ కవర్గంగా తీర్చిదిద్దడమే తమ కర్తవ్యం గా భావిస్తానని ఆయన అన్నారు.రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం మరిన్ని పథకాలు, సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ ఆర్డీవో కె.విజయలక్ష్మి, కలికిరి తహశీల్దార్ సయ్యద్ అహ్మద్, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, నల్లారి అభిమానులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమరావతి పోరాటం ప్రతి భారతీయుడు తెలుసుకోవాల్సిన చరిత్ర

### అమరావతి పుస్తకం కాదు..ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిరునామా -ఎంపీ చిన్ని

### కేంద్ర మంత్రి ఖట్టర్‌కు 'అమరావతి' పుస్తకం అందజేసిన ఏపీ కూటమి ఎంపీల బృందం




**(న్యూఢిల్లీ/పార్లమెంట్)(సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 05:**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి చరిత్ర, ప్రజల పోరాటం, పునర్నిర్మాణ సంకల్పాన్ని ప్రతిబింబించే "అమరావతి: ప్రజలచే నిర్మించబడింది... విధిచే రక్షించబడింది" కాఫీ టేబుల్ బుక్‌ను కేంద్ర విద్యుత్, గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మోహన్‌లాల్ ఖట్టర్ కు ఏపీ కూటమి ఎంపీల బృందం మర్యాదపూర్వకంగా అందజేసింది. ఈ బృందంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కూడా పాల్గొన్నారు. బుధవారం పార్లమెంట్ లోని మంత్రి ఖట్టర్ కార్యాలయం లో ఆయనను కలిసి అమరావతి నిర్మాణ గాథను ప్రతిబింబించే ఈ కాఫీ టేబుల్ బుక్‌ను అందించింది.ఈ సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ, అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం, రైతులు--మహిళలు సాగించిన 1,631 రోజుల ఉద్యమం, అలాగే 2024 జూన్ 2న అమరావతిని రాష్ట్ర రాజధానిగా పునరుద్ధరించిన చారిత్రక నిర్ణయం వంటి అంశాలను ఈ పుస్తకం కళ్లకు కట్టినట్లు వివరిస్తుందని తెలిపారు.అమరావతి మరపురాని పోరాటం ప్రతి భారతీయుడుతెలుసుకోవాల్సిన చరిత్ర! అని,"అమరావతి పుస్తకం కాదనీ,ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిరునామా!" అని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఎన్డీఏ ప్రభుత్వ సహకారంతో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా, సంపద సృష్టి, ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ఎంపీల బృందం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చిన్ని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను దేశ నాయకత్వానికి వివరించేందుకు ఇటువంటివి ఉపయోగపడుతున్నాయని తెలిపారు. విజయవాడ ప్రాంతంలోని పలు సమస్యలను సైతం కేంద్రమంత్రి ఖట్టర్ దృష్టికి ఎంపి చిన్ని తీసుకువెళ్లారు దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## మత్స్యకారులకు ఎలనినో ప్రభావ అవగాహన....




**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఆగస్టు 5:**

డా బి ఆర్ అంబేద్కర్ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలేం, తుఫాను ఆశ్రమ భవనం నందు మత్స్యశాఖ ఆధ్వర్యంలో బోటు ఓనర్లకు, కలాసీలకు, మత్స్యకారులకు, ఎలనినో ప్రభావం 2026-27 ప్రభావంపై అవగాహన, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాజోలు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి అయిన సిహెచ్ గోపాలకృష్ణ, మాట్లాడుతూ ఎలనినో ప్రభావం రాబోయే సంవత్సరం వరకు ఉంటుందని, మత్స్యకారులందరూ తగు సూచనలు పాటిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ట్రాన్స్పాండర్లను, ప్రతి బోటుకు ప్రభుత్వం కంపల్సరీ చేశిందని, త్వరలో ప్రతి బోటుకు అమరుస్తామని, అవి వేట సమయంలో ప్రమాదాలు జరిగితే, సమాచారం తెలుసుకోడానికి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. నభ మిత్ర యాప్ ను అందరూ ఇన్స్టాల్ చేసుకొని, ఎప్పటికప్పుడు యాప్ అందరి సమాచారాన్ని తెలుసుకోవాలని వారికి తెలియజేశారు. ఈ యొక్క సదస్సుకు అంతర్వేది గ్రామ మత్స్య సహాయకులు, సాగరమిత్ర, గ్రామ పెద్దలు, మత్స్యకారులు హాజరయ్యారు.

## నకిలీ రూ.500 నోట్ల చలామణి

### పోలీసుల అదుపులో ఇద్దరు

### భీమవరం లింక్‌పై దర్యాప్తు



**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్ ఆగస్టు 5**

నాగర్‌కర్నూల్ జిల్లాలో నకిలీ రూ.500 నోట్ల చలామణి కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో బిజినపల్లి మండలం మంగనూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో లభించిన వివరాల ఆధారంగా నకిలీ నోట్లు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి జిల్లాకు చేరినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రత్యేక పోలీసు బృందాలు భీమవరానికి వెళ్లి దర్యాప్తు చేపట్టాయి. అక్కడ పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మంగనూరు గ్రామంలోని ఓ వైన్‌షాప్‌లో నకిలీ నోట్లతో మద్యం కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ఆ నోట్లను బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లగా అవి నకిలీవని తేలడంతో వైన్‌షాప్ క్యాషియర్ బిజినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో జిల్లాలోకి ఎంత మొత్తంలో నకిలీ నోట్లు వచ్చాయి, వాటి పంపిణీలో ఎవరెవరు ఉన్నారు, దీని వెనుక ఉన్న ముఠా వివరాలు ఏమిటన్న కోణాల్లో నాగర్‌కర్నూల్ డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణ పూర్తైన అనంతరం నిందితులను అధికారికంగా అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది. అయితే ఈ వ్యవహారంపై పోలీసులు ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.


# ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్ట్ 5**

ఉపాధ్యాయ అర్హత పరీక్షలను (టెట్) ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా, అత్యంత ప్రశాంత వాతావరణంలో పకడ్బందీ గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక గ్రామీణ మండల అచ్యుతా పురం పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఆన్ డిజిటల్ జోన్ ఉపాధ్యాయ అర్హత పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు .... ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును క్షుణ్ణం గా పరిశీలించి, అధికారుల కు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.? ఈ సందర్భంగా జిల్లా లికలెక్టర్ మాట్లాడుతూ...లి పరీక్షా కేంద్రాల వద్ద అభ్య ర్థులకు ఎటువంటి అసౌ కర్యం కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిం చాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలోఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసేలా తగిన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలతో లోపలికి వెళ్లకుండా కట్టు దిట్టమైన తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు,పోలీ సు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుర్రంకొండలో తల్లి పాల వారోత్సవాలు



**ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 5 సిటిజన్ టైమ్స్**

అన్నమయ్య జిల్లా గుర్రంకొండ తాలీం వీధిలోని అంగన్వాడీ కేంద్రం నందు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భవతులను, చిన్న పిల్లల తల్లులను సమావేశ పరచి వారికి తల్లి పాలు గురించి వివరించారు. తల్లి పాలతోనే ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని, తల్లులు తమ పిల్లలకు తల్లి పాలే కొనసాగించాలని, బిడ్డ పుట్టిన గంట లోపు బిడ్డకు ముర్రు పాలు తాపించాలని, తల్లి బిడ్డకు ఏ పద్దతిలో ఉంచుకొని పాలు పట్టాలో తెలిపారు. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లి పాలే ఇవ్వాలని, ఇతర ద్రవాలు ఏవి ఇవ్వరాదని, ఆరు నెలల తరువాత అనుబంధ ఆహారం తో పాటు రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో అంగన్వాడీ సూపర్వైజర్ మహాలక్షి అంగన్వాడీ వర్కర్స్ టి. పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం

**భట్నవిల్లి గ్రామంలో 'ఇంటింటి ప్రచారం' జన నీరాజనాల మధ్య ప్రతి ఇంటా మమేకమైన ఎమ్మెల్యే ఆనందరావు**



**అమలాపురం సిటిజన్ టైమ్స్ 05**

ప్రజా క్షేమమే పరమావధిగా, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అమలాపురం నియోజకవర్గ లిశాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఊపందుకున్న ,ఇంటింటి ప్రచారం'లి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన భట్నవిల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించి, పల్లె పల్లెనా ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి, గత రెండేళ్ల కూటమి సుపరిపాలనలో ప్రజలకు చేకూరిన సంక్షేమ ఫలాలను, గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. స్థానికులు తెలిపిన విన్నపాలు, ఎదుర్కొంటున్న సమస్యలను ఓపికగా ఆలకించిన ఆయన, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనా సంస్కరణలు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజానిబద్ధత, విద్యా, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేష్ యువ నాయకత్వం కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయని కొనియాడారు. ఎక్కడా పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలు చూపుతున్న అభిమానం, ప్రభుత్వంపై ఉన్న చెక్కుచెదరని నమ్మకమే తమకు నిరంతరం కష్టపడి పనిచేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భీమనపల్లిలో యూనిట్ స్థాయి టిడిపి సమావేశం

**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే యూనిట్ స్థాయి సమావేశం భీమనపల్లి పంచాయతీ పరిధిలోని 2-141 మెయిన్ రోడ్డులో గల యూనిట్ నెంబర్--40 ఇన్‌చార్జ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం నివాసంలో బుధవారం నిర్వహించారు. యూనిట్ నెంబర్--39, 40 పరిధిలోని గ్రామ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఏ అంశాల్లో సంతృప్తిగా ఉన్నారు, ఏ అంశాల్లో అసంతృప్తిగా ఉన్నారనే విషయాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన సూచనలను సేకరించి తీర్మానాలు రూపొందించారు. అనంతరం యూనిట్ కమిటీ సమావేశ వివరాలు, సభ్యుల సూచనలు, ప్రజల అభిప్రాయాలను మై టీడీపీ యాప్‌లో అప్లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ నెంబర్--39 ఇన్‌చార్జ్ జంపన సుమన్ వర్మ, యూనిట్ నెంబర్--40 ఇన్‌చార్జ్ మరియు రాష్ట్ర ఆర్యవైశ్య



కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, భీమనపల్లి సొసైటీ అధ్యక్షుడు ఆకేటి శ్రీనివాసరావు (పెద్ద), భీమనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మంచెం బుజ్జి, విలసవిల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి సత్తిబాబు, భీమనపల్లి గ్రామపంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు గోపి, మాజీ అధ్యక్షుడు ఆకేటి బాబులు,బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# కేంద్ర ఆడిట్ బృందంచే ఎరువుల దుకాణాలు తనిఖీ



**ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 5సిటిజన్ టైమ్స్**

అన్నమయ్య జిల్లా మండల కేంద్రమైన గుర్రంకొండలో కేంద్ర ఆడిట్ బృందం (ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం) వారు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎరువుల దుకాణం లో ఎరువులు, లైసెన్సు, స్టాక్ బోర్డ్, స్టాక్ డీటైల్స్ మొదలగునవి పరిశీలించారు. ఎరువులు ప్రభుత్వ ధరకంటే ఎక్కువ అమ్మకూడదని, ప్రతి రైతుకు ఎరువుల బిల్లులు ఇవ్వాలని, అలా చేయనిచో లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని ఎరువుల దుకాణం వారికి తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఆడిట్ అధికారులు అశోక్ మీనా, నవీన్, సోమయాజులు మదనపల్లి ఏ డి ఏ మజీద్ అహమ్మద్, టెక్నీకల్ ఏ ఓ నవంత్ బాబు,మండల వ్యవసాయ అధికారిణి టి. రత్నమ్మ పాల్గొన్నారు.

# ఏళ్ల తరబడిన సమస్యకు శాశ్వత పరిష్కారం



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

కోట్లాది రూపాయలు తో నిర్మించినా ఏనాడూ ప్రజలకు ఆ రోడ్డు అక్కరకు రాలేదు. పలుమార్లు రిపేర్లు చేపట్టినా ఉపయోగం లేదు. ప్రతీ సారి తమకు ఈ రోడ్డు అవసరం అంటూ ప్రజలు గగ్గోలు పెట్టేవారు. అదే అమలాపురం హౌసింగ్ బోర్డు ఎడమ వైపున వున్న కాలువ రోడ్డు (నల్ల వంతెన... ఎర్ర వంతెన రోడ్డు ఆర్ డి ఓ ఆఫీస్ ఎదురుగా) రెండేళ్లు అయినా శాసన సభ్యులు ఆనంద రావు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తాయి. అయినా మూడు సార్లు ఆయన రిపేర్లు చేయించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇక శాశ్వత పరిష్కారం వైపు ఆనందరావు అడుగులు వేశారు. అందులో భాగంగా మున్సిపల్ మంత్రి నారాయణ ముందు పలుమార్లు ఫైల్ పెట్టి ఆ రోడ్డుకు నిధులు కావాలని అభ్యర్థించారు. చివరకు 2.5 కోట్ల తో సిమెంట్ రోడ్డు మంజూరు చేయించుకున్నారు. శంకుస్థాపనకు అమలాపురం విచ్చేసిన మంత్రి నారాయణ నాటి సమావేశం లో మాట్లాడు తూ కనిపిస్తే చాలు, ఈ రోడ్డు అభివృద్ధి కి నిధులు కావాలంటూ వెంట పడేవాడు ఆనంద రావు, పట్టుదల కు ప్రస్తుత ఆర్థిక పరిస్థితి లోను తలవంచక తప్పలేదు అన్నారు. కాంట్రాక్టర్ ను, మున్సిపల్ అధికారులు ను బుధవారం పిలిచి రోడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. సిమెంట్ రోడ్డు చాలా బలంగా వుండాలని, ఓ ఎన్ జి సి వాహనాలు సైతం ఈ రోడ్డుపై పయనం సాగిస్తాయని, అధికారులు నిరంతర పర్యవేక్షణ చేసి ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మున్సిపల్ డి ఈ సత్యనారాయణ తదితరులు వున్నారు.

# కార్మిక శాఖ మరింత సమర్థవంతం

**తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం ప్రతినిధులతో సమావేశమైన మంత్రి వాసంశెట్టి సుభాష్**

**అమరావతి/ రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర కార్మిక,ఫ్యాక్టరీలు, బాయిలర్స్, వైద్య సేవల బీమా శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం, కార్మికుల సమస్యలు, అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రత, కార్మిక సంక్షేమ బోర్డుల పనితీరు, కార్మిక చట్టాల అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కార్మిక శాఖ మరింత సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. టీఎన్‌టీయూసీ ప్రతినిధులు వివిధ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వాటిని సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, టీఎన్‌టీయూసీతో సమన్వయంగా పనిచేస్తూ కార్మిక సంక్షేమ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ బోర్డు చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# భట్నవిల్లి గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

## రైతులకు భరోసా ఇఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం (రూరల్) సిటిజన్ టైమ్స్, ఆగస్టు 05**

అమలాపురం నియోజకవర్గం, భట్నవిల్లి గ్రామంలో బుధవారం రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. అమలాపురం లిశాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావులి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన రైతులకు ఈ నూతన రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేశారు. రైతే రాజు అనే విశ్వాసంతో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం, వారి ఆస్తులకు శాశ్వత భద్రత కల్పిస్తూ అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియను చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. గత పాలనలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పట్టాదారు పాస్ పుస్తకాలపై తమ స్వంత చిత్రాలను ముద్రించుకుని రైతుల ఆస్తులను తమవిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే ఆనందరావు ఈ సందర్భంగా గుర్తు చేశారు., ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఏ రాజకీయ నాయకుని ఫోటో లేకుండా, కేవలం అధికారిక రాజముద్రతోనే ఈ పుస్తకాలను రూపొందించారని స్పష్టం చేశారు. ఇందులో యజమాని ఫోటోతో పాటు భూ సరిహద్దులను స్పష్టంగా తెలిపే డిజిటల్ మ్యాప్, నకిలీలకు తావులేకుండ క్యూ ఆర్ కోడ్ సాంకేతికతను జోడించి నివాస స్థలాలు, పొలాలు కలిగిన రైతులకు అందజేస్తున్నట్లు వెల్లడించారు.

రైతుల ఆస్తులకు సంపూర్ణ రక్షణ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, నూతన పాస్ పుస్తకాలు అందుకున్న రైతుల ముఖాల్లోని సంతోషమే కూటమి సుపరిపాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే ఆనందరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న మిగిలిన భూమి చిక్కులు, రెవెన్యూ సమస్యలను కూడా ప్రాధాన్యతా క్రమంలో త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, వీఆర్‌వోలతో పాటు స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు భట్నవిల్లి గ్రామ రైతులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండేళ్ల నాటి త్రాగునీటి సమస్యకు పరిష్కారం





**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

మండలం లోని బోడసకుర్రు గ్రామపంచాయతీ పరిధిలోని పల్లెపాలెం కాలనీలో రెండేళ్ల క్రితం రోడ్డు నిర్మాణ0 తలపెట్టినప్పుడు నీటి పంపు అడ్డంగా ఉందనే కారణంతో అందరికీ ఉపయోగపడే కుళాయిని డమ్మీ చేయడం జరిగింది. తరచూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం శూన్యమని అక్కడ ప్రజలు వాపోయారు.ఈ సమస్యను బిజెపి మండల కార్యదర్శి, ఆత్మ డైరెక్టర్ ఓలేటి పరమేశ్వరరావు బిజెపి అల్లవరం మండల అధ్యక్షులు కట్టా నారాయణమూర్తి దృష్టికి తీసుకు రాగా ఆ సమస్యను బొజ్జు రాజు సమక్షంలో ఆ సమస్యను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది. రెండేళ్ల నాటి సమస్యను పరిష్కరించి మాకు త్రాగు నీటిని అందించినందుకు గాను గ్రామ ప్రజలు జిల్లా అధికారులకు, బిజెపి మండల అధ్యక్షులు కట్టా నారాయణమూర్తికి మరియు ఓలేటి పరమేశ్వరరావుకీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శి చిక్కం శ్రీను, పంచాయతీ సిబ్బంది ప్రజలు పాల్గొనడం జరిగింది.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర బంద్....



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఆగస్టు 5:**

అంబేడ్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గం లో విజయవంతమైన ఏ బి వి పి రాష్ట్ర బంద్ ను ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్ చేస్తూ ఆగస్టు 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాశాలల బంద్ కు ఏ బి వి పి రాష్ట్ర శాఖ పిలుపునిచ్చింది. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 6,800 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి. కార్పొరేట్, ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని అరికట్టి పేద విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నతమైన విద్య అందుబాటులో ఉండాలి. 9 డిమాండ్లతో ఆగస్టు 5న రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్ కు ఏ బి వి పి పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పోలిశెట్టి గణేష్, తాడి రవీంద్ర, విజయ్, అరుణ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తాగునీటి కష్టాలు



**వేమిరెడ్డిపల్లి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 05:**

ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా మారింది. ఏడు శివారు గ్రామాలకు ఆధారమైన మంచినీటి బోరు నెలరోజులుగా పని చేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 25 ఏళ్లగా ఇదే బోరు నీటిని వినియోగిస్తున్నామని, ప్రస్తుతం పొలాల నీటిపై ఆధార పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉచిత వైద్య సేవలు అభినందనీయం

### వడ్డిగూడెం బాలికల వసతి గృహంలో ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

అమలాపురం పట్టణం, వడ్డిగూడెం ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహంలో లి'స్వర్ణాంధ్రఏ2047 విజన్ ప్లాన్' సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, లిముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కిలి విద్యార్థుల పట్ల ఉన్న ప్రత్యేక ప్రేమ, ఆప్యాయతల వల్లే ఈ విధమైన ఆరోగ్య కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు పూర్తి ఆరోగ్యంతో ఉన్నప్పుడే చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి చేరుకుంటారనే దృఢమైన ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం వైద్యులతో మందులు, నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తోందని తెలిపారు. ఉచిత వైద్య సేవలు అందిస్తున్న లిశ్రీ కోనసీమ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులనులి ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. శిబిరంలో శ్రీ కోనసీమ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రముఖ వైద్యులు డాక్టర్ కే.శ్రీమన్నారాయణ (స్కిన్ కేర్), డాక్టర్ శ్రీవిద్య (గైనకాలజీ), డాక్టర్ మనోహర్ లి (జనరల్) విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు, ఉచిత మందులను అందజేశారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, చదువుతో పాటు ఆరోగ్యం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. న్యాయవాది దగ్గర, డాక్టర్ దగ్గర ఎప్పుడూ నిజాలే చెప్పాలని, విషయాలు దాస్తే అక్కడ కేసు గెలవలేము, ఇక్కడ ఆరోగ్యాన్ని బాగుచేసుకోలేమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో 'స్వర్ణాంధ్రఏ2047 విజన్ ప్లాన్' నియోజకవర్గ ప్రత్యేక అధికారి , కూటమి ముఖ్య నాయకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# మకటపల్లిలో ఇంటింటా తెలుగుదేశం

**మామిడి కుదురు సిటిజన్ టైమ్స్ఆగస్టు 5**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మగటపల్లి గ్రామంలో ప్రతి నెల మొదటి బుధవారం యూనిట్ ఇంచార్జ్ కుంచే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే సమావేశం 198వ వార్డు బూత్ కన్వీనర్ బొంతు రవి వర్మ ఇంటి వద్ద నిర్వహించబడినది. తదనంతరం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా 198వ వార్డులో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు పాల్గొని ప్రతి ఇంటింటికి తిరిగి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని వాటికి పరిష్కార దిశగా పనిచేస్తామని హామీ ఇవ్వడం జరిగినది. అలాగే ఈరోజు తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి గ్రామంలో పొగాకు రైతులను పరామర్శించే నెపముతో ప్రతిపక్ష నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతులతో సమావేశం పేరుతో ప్రభుత్వం పై అవాస్తవాలు మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వాన్ని విమర్శించటం సిగ్గుచేటని నామన అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు కుమారుడు ఒక వ్యక్తి మరణానికి కారణమైతే ఆ బాదిత కుటుంబాన్ని పరామర్శించడం మాని, ఎవరైతే నిందితుడిగా



ఉన్న మాజీ మినిస్టర్ వాళ్ళ ఇంటికి వెళ్లి నిందితులను పరామర్శించడం చాలా దారుణమైన విషయం. అదే టైంలో అక్కడ విధి నిర్వహణలో ఉన్న మహిళ ఎస్సై మీద ఈ వైసీపీ గుండాలు దాడి చేయడం హీనమైన చర్యగా మేం ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కుంపట్ల బాబ్జి నామన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నీటిపారుదల వనరుల ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి

### జిల్లా, డివిజన్, మండల స్థాయి ఇరిగేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

నీటిపారుదల వనరుల ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బుధవారం కలెక్టరేట్ నుండి టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో డివిజన్, మండల స్థాయి ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని కాలువలు, చెరువులు, డ్రైన్లు, ఇతర నీటిపారుదల వనరులపై జరిగిన ఆక్రమణలను గుర్తించి నిబంధనల మేరకు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో కాలువలు, చెరువులు, హెడ్‌వర్క్స్ వారీగా ఆక్రమణల పూర్తి వివరాలను నమోదు చేసి ప్రత్యేక రిజిస్టర్లు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన ఆక్రమణలపై రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖలు సమన్వయంతో పనిచేసి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. రిజిస్టర్లపై సంబంధిత వీఆర్‌వోలు,తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, వాటర్ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుల ధృవీకరణ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అనంతరం భౌతిక పరిశీలన నిర్వహించి నిబంధనల ప్రకారం ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి, డి ఆర్ ఓ వి సుబ్బారావు, ఇరిగేషన్ ఎఈ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పశువులలో సీజనల్గా వచ్చే వ్యాధులకు టీకాలు





**సంతమాగులూరు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

వెటర్నల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జి వెంకట్రావు ఆదేశాల మేరకు సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామంలో బుధవారం తెల్ల పశువులు అయినటువంటి ఎద్దులకు ఆవులకు సీజనల్గా వచ్చే వ్యాధులకు ముందుగానే లంపి స్కిన్ డిసీజ్ అనే టీకాలు వేయడం జరిగింది. రైతు సేవా కేంద్రం లో పనిచేస్తున్న యానిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్ బి గాలయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో బుధవారం ఒక్కరోజే మక్కెనవారిపాలెం గ్రామంలో రైతుల దగ్గరకు స్వయంగా వెళ్లి సుమారు 100 పశువులకు టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా జి గాలయ్య మాట్లాడుతూ ఈ టీకాలు పశువులకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండబోవని స్కిన్ కు సంబంధించి వచ్చే వ్యాధులను రాకుండా పశువులను కాపాడుకోవచ్చని తెలిపారు. ఏదైనా పశువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు మక్కెనవారిపాలెం ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రిలో తాము నిత్యం అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు. ఇవే కాకుండా ప్రతిరోజు 20 నుండి 30 పశువులకు వైద్యం అందిస్తున్నామని ఇక్కడికి పక్క గ్రామాల్లో ఉన్న పశువులను కూడా తీసుకవచ్చి వైద్యం చేయించుకుంటున్నారని, అవగాహన లేని రైతులకు సీజన్లో వచ్చే వ్యాధుల గురించి వారికి వివరించి, పశువుల గర్భ పరీక్షలు పశువులకు ఇవ్వవలసిన దాన, మేతను ఏ ఏ క్రమంలో ఇవ్వాలో వారికి వివరంగా తెలిపారు గురించి. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సబ్ అసిస్టెంట్ జి రవికిరణ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలు - రహదారి ప్రమాదాలపై ప్రత్యేక నిఘా..

### బల్లికురవ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి




**సంతమాగులూరు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి సంతమాగులూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని బల్లికురవ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బల్లికురవ పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించారు.

**నేరాలపై నిఘా...:** సంతమాగులూరు సర్కిల్, దర్శి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నమోదైన కేసులు, పాత నేరస్తుల కదలికలు, పెండింగ్ కేసుల దర్యాప్తు, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ముందస్తు సమాచార వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.

**ప్రమాదాల తగ్గింపే లక్ష్యం..:** రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించే దిశగా ట్రాఫిక్ అమలును మరింత కట్టుదిట్టం చేయాలని ఐజీ ఆదేశించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్ట్ నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం కూడా ప్రమాదాల నియంత్రణలో కీలకమని పేర్కొన్నారు.

**ప్రజలతో మమేకం కావాలి..:** శాంతిభద్రతల పరిరక్షణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, గ్రామస్థాయిలో సమాచార సేకరణ, రాత్రి గస్తీని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి విశ్వాసాన్ని పెంపొందించేలా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ, సంతమాగులూరు సీఐ శేషగిరిరావు, సంతమాగులూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సిద్దా చేతుల మీదుగా ఏలూరు బ్యాంక్ ప్రారంభం






**ఒంగోలు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

స్థానిక రాజాపాగల్ రోడ్డు లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏలూరు బ్యాంక్ ఒంగోలు బ్రాంచ్ ను మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు ప్రారంభించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో శిద్దా రాఘవరావు పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో బ్యాంకు సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవ రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అనేక బ్రాంచ్ లు కలిగి బ్యాంకింగ్ సేవల్లో వినియోగదారుల మన్ననలు పొంది ఒంగోలులో నూతన బ్రాంచ్ ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ఏలూరు బ్యాంకు దినదినాభివృద్ధి చెంది బ్యాంకు కస్టమర్స్ విశ్వాసాన్ని పొందాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకు చైర్మన్ సిబ్బందికి శిద్దా అభినందనలు తెలియజేశారు. ముందుగా బ్యాంకు చైర్మన్ ఏలూరి గురవయ్య తన సిబ్బంది తో కలసి శిద్దా రాఘవ రావు కి పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. శాలువతో సత్కరించి మెమంటో అందచేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సూపర్ మాజీ చైర్మన్ తాతా ప్రసాద్, బ్యాంకు డైరెక్టర్ ఏలూరు దత్త వెంకట కిరణ్, బ్యాంకు సీఈఓ షేక్ రియాజ్ అహ్మద్, బ్రాంచ్ మేనేజర్ గుండా వెంకట వరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 16న నాగభైరవ పురస్కార ప్రదాన సభ

**పెన్ పవర్ ఒంగోలు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**



నాగభైరవ పురస్కారసభ ఈనెల 16 వ తేదీ ఆదివారం ఉదయం సంతపేటలోని రంగాభవన్ లో జరుగుతుందని, ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు దారా సాంబయ్య,ఆత్మీయ అతిథులుగా నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), ఈదర హరిబాబు, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), బెజవాడ వెంకట రావు, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్ బాబు పాల్గొంటారని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు కళారత్న డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తెలియజేశారు. ఈ సమావేశంలో గొల్లపూడి ప్రకాశరావు కి ఆత్మీయ పురస్కారం,పేట యుగంధర్, మాచిరాజు కామేశ్వరరావు,చింతల శ్రీనివాస్ గుప్తలకు సాహిత్య పురస్కారాలను,నుసుము నాగభూషణంకు కళా పురస్కారం ప్రదానం చేస్తారనీ,సభాహ్వానం సింహాద్రి జ్యోతిర్మయి నిర్వహిస్తారని, సభలో కళారత్న డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు,డాక్టర్ బీరం సుందరరావు,డాక్టర్ గంగిశెట్టి శివకు మార్ తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. సాహితీవేత్తలు,కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

## పాఠశాలల శానిటేషన్ వర్కర్లకు పెండింగ్ గౌరవ వేతనం చెల్లించాలి




**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 5**

గిద్దలూరు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లకు ఐదు నెలల పెండింగ్ గౌరవ వేతనము చెల్లించాలని బుధవారం గిద్దలూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం డేటా ఎంట్రీ ఆపరేటర్ భాస్కర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ శానిటేషన్ వర్కర్స్ నాయకురాలు ఎం మేరీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లకు పెండింగ్లో ఉన్న ఐదు నెలల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల మొదటి వారంలో గౌరవ వేతనం చెల్లించాలని రాజకీయ వేధింపులు ఆపాలని ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకురాలు డి రుతమ్మ గిద్దలూరు మండల కన్వీనర్ బి నర్సింహులు, జి విశ్రాంతమ్మ మాట్లాడుతూ అతి తక్కువ గౌరవేతనం తీసుకుంటున్న స్కూల్ శానిటేషన్ వర్కర్స్ కి నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని వారికి వెంటనే పెండింగులో ఉన్న ఐదు నెలల వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకురాలు ఏ కుమారి స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు మరియమ్మ, ఎస్కే మౌలాభి కే భారతి తదితరులు పాల్గొన్నారు.

# పియానో వాయిస్తూ.. బుట్టబొమ్మలోని కొత్త కోణం

తెలుగు లోగిళ్లకు -బుట్టబొమ్మ-గా సుపరిచితమైన స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే ఇటీవల తనలోని సరికొత్త కళాత్మక కోణాన్ని ఆవిష్కరించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. నిరంతరం సినిమాలు, గ్లామరస్ ఫోటోషూట్‌లతో బిజీగా ఉండే ఈ భామ.. తాజాగా తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేసిన ఒక క్యూట్ అండ్ స్పెషల్ వీడియో నెట్టింట విపరీతంగా వైరల్‌గా మారింది. కేవలం నటనలోనే కాకుండా సంగీతంలోనూ తనకున్న ప్రతిభను చూపేందుకు పియానో వాయిద్య ప్రదర్శనతో పూజా నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.హాలీవుడ్‌లో ఆస్కార్ అవార్డులను కొల్లగొట్టిన పాపులర్ మ్యూజికల్ డ్రామా -లా లా ల్యాండ్-. ఈ చిత్రంలోని ఐకానిక్ మేలడీ ట్యూన్ -మియా అండ్ సెబాస్టియన్ థీమ్- ప్రతి ఒక్కరినీ మైమరిపిస్తుంది. గత కొద్దిరోజులుగా ఈ ధున్ తన మనసును బాగా వెంటాడుతోందని.. అందుకే స్వయంగా దీన్ని ఎలా ప్లే చేయాలో నేర్చుకుని.. కీబోర్డ్ -పియానోపై ప్లే చేశానని పూజా హెగ్డే వెల్లడించారు. ఎంతో ఏకాగ్రతతో, ఎంతో నైపుణ్యంతో ఆ నోట్స్ ప్లే చేస్తుంటే నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు.

ఈ మ్యూజికల్ వీడియోకు పూజా హెగ్డే జోడించిన సరదా క్యాప్షన్ మరింత హంగామా సృష్టిస్తోంది. --గత కొన్ని రోజులుగా ఈ ట్యూన్ నన్ను వెంటాడుతోంది. ఎలాగైతేనేం దీన్ని ప్లే చేయడం నేర్చుకున్నాను. ఇక ఇప్పుడు హాలీవుడ్ స్టార్ హీరో ర్యాన్ గోస్లింగ్ ఇక్కడికి రావడమే ఆలస్యం!-- అంటూ చమత్కారంగా శీర్షిక రాసుకొచ్చారు. -లా లా ల్యాండ్- చిత్రంలో ర్యాన్ గోస్లింగ్ పియానో ప్లేయర్ పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంలోని మూడ్‌కు అనుగుణంగా పూజా సరదా వ్యాఖ్య అభిమానులను ఎంతగానో అకట్టుకుంది. ఈ వీడియోలో పూజా హెగ్డే వాయించిన పియానో ట్యూన్‌తో పాటు తన లుక్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయబద్ధమైన చీరకట్టు- షార్ట్ హెయిర్ స్టైల్‌తో ఎంతో ప్రశాంతంగా, అందంగా కనిపిస్తూ నెటిజన్ల మనసులను దోచుకున్నారు. పూజాలోని సంప్రదాయం, ఆధునిక భావాలు కలగలిసి కనిపించడంతో ఈ వీడియోకు లక్షలాది లైక్స్ - వ్యూస్ లభిస్తున్నాయి. అభిమానులు ఈ రూపంలో పూజాను చూసి మురిసిపోతున్నారు.ప్రస్తుతం ఈ పోస్ట్‌పై ఫ్యాన్స్ సహా సినీ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. -లా లా ల్యాండ్- సినిమాలో నటి ఎమా స్టోన్ చేసిన మియా పాత్రలాగే మీరు ఎంతో అందంగా ఉన్నారు.. పూజా హెగ్డే కీబోర్డ్ ప్లే చేయడం.. మధ్యలో ఆమె చిందించిన చిరునవ్వు నిజంగా అద్భుతం! అంటూ నెటిజన్లు కామెంట్ల రూపంలో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఒక కథానాయికగా గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా... ఇలాంటి విభిన్నమైన నైపుణ్యాలను బయటపెడుతూ బుట్టబొమ్మ అందరినీ ఆకట్టుకుంటోంది. పూజా నటించిన జననాయగన్ ఇటీవలే విడుదలైన సంగతి తెలిసిందే. తదుపరి వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



నేహా శెట్టి 'పల్ప్ ఫిక్షన్' తరహా శైలి: ఆకర్షణీయమైన లుక్ సినీ కెరీర్





ప్రకృతి పావని ఆధునిక సొబగులను నిర్వచించింది

## టీమిండియా అలా మారటానికి.. విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి నే కారణం



మాజీ కెప్టెన్ ధోనీ రిటైర్మెంట్ తర్వాత టీమిండియాలో వచ్చిన మార్పులపై కీలక వ్యాఖ్యలు చేశారు మాజీ వైస్ కెప్టెన్ అజింక్యా రహానే. ఇటీవలే అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన రహానే.. క్రికెట్ కు సంబంధించిన కీలక విషయాలను పంచుకున్నారు. ధోనీ తర్వాత టీమిండియా అలా మారటానికి కారణం కోహ్లీ, రవిశాస్త్రిలేనని అన్నారు.

ధోనీ రిటైర్మెంట్ టీమిండియాను ఒక క్లిష్టమైన దశలో పడేసిందని అన్నారు. ఆ సందర్భంలో టీమ్ మైండ్ సెట్ ను మార్చడంలో విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఆటగాళ్లను డేరింగ్, డ్యాషింగ్ గా మార్చడంలో ఈ ఇద్దరు ఎంతో చేశారని అన్నారు. ముఖ్యంగా ఓవర్సీస్ కండిషన్స్ లో టీమ్ మైండ్ సెట్ ను సెట్ చేయడంలో హెడ్ కోచ్ రవిశాస్త్రి, కోహ్లీల పాత్ర మరువలేనిదని అన్నారు. మైకెల్ వాన్, సర్ అలస్టిర్ కుక్, ఫిల్ టఫ్నెల్, డేవిడ్ బంబెల్ లలాయిడ్ కలిసి స్టిక్ టు క్రికెట్ పాడ్ కాస్ట్ లో పాల్గొన్న రహానే ఈ వ్యాఖ్యలు చేశారు. 2014-15లో ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీ మధ్యలో ధోనీ రిటైర్ అయినప్పుడు, కోహ్లీ టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాడు. కోహ్లీ తన టీమ్ కు దూకుడుగా ఉండేలా తయారు చేశాడు. ఇది ఇండియాను ప్రపంచంలోనే బలమైన ట్రావెలింగ్ టీమ్ గా ఎదగడానికి సహాయపడింది. ఆ టైమ్ లో టీమ్ లో ఉన్న రహానే, టీమ్ మెంటాలిటీని మార్చినందుకు కోహ్లీకి, అప్పటి హెడ్ కోచ్ రవిశాస్త్రికి ఈ క్రెడిట్ ఇచ్చాడు.ఎంఎస్ ధోనీ టెస్ట్ క్రికెట్ నుండి తప్పుకున్నప్పుడు, విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి భారత క్రికెట్‌ను, ముఖ్యంగా విదేశీ టెస్టుల్లో మరింత పటిష్టం చేశారు. రక్షణాత్మకంగా కాకుండా, మరింత అగ్రెసివ్ గా, ధైర్యంగా, ముందుచూపుతో ఆడేవాళ్ళగా మారినట్లు రహానే అన్నారు.

మొదటి బంతి నుంచే దాడి చేయాలనిపిస్తే, అలాగే చెయ్యి

అని విరాట్ నాకు ఎప్పుడూ చెప్పేవాడు. ఆయన ఆటగాళ్లకు నిర్భయంగా ఆడేందుకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చారు, అని చెప్పారు. కోహ్లీ, శాస్త్రిల సారథ్యంలో ఇండియా టెస్ట్ దశల్లో అత్యంత విజయవంతమైన దశను ఆస్వాదించింది. ఆస్ట్రేలియాలో చారిత్రాత్మక సిరీస్‌లను గెలుచుకోవడం, ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకోవడం, తొలి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించడం వంటివి వీళ్లిద్దరి కాంబోలోనే జరిగాయి.

## టీమిండియా మరో బిగ్ షాక్.. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు స్టార్ బ్యాటర్ దూరం..!






శ్రీలంకతో జరగనున్న టెస్ట్ సిరీస్?కు ముందు టీమిండియాకు మరో బిగ్ షాకే తగిలే అవకాశం ఉంది. గాయం కారణంగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఇప్పటికే ఈ సిరీస్?కు దూరమైన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగానే.. స్టార్ బ్యాటర్ సాయిసుదర్శన్ సైతం శ్రీలంకతో జరగనున్న తొలి టెస్ట్?కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. గత నెలలో శ్రీలంక ఏతో జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్?లో సాయిసుదర్శన్ గాయపడ్డాడు.

కాలి వేలికి గాయం కావడంతో ప్రస్తుతం బెంగళూర్?లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. ఆగస్ట్ 15 నుంచి సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆగస్ట్ 4న టీమిండియా శ్రీలంకకు వెళ్లింది. సాయిసుదర్శన్ మాత్రం భారత జట్టుతో ప్రయాణించలేదు. గాయం పూర్తిగా నయం కాకపోవడంతో అతడు తొలి టెస్ట్?కు దూరమయ్యే అవకాశం ఉంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పైనే అతను ఈ సిరీస్?లో ఆడుతాడా లేదా అనే దానిపై ఆధారపడి ఉంది. సాయిసుదర్శన్ కండిషన్?పై బీసీసీఐ వర్గాలు అప్డేట్ ఇచ్చాయి. "శ్రీలంకతో జరుగుతున్న రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి టెస్టుకు సుదర్శన్ దూరమయ్యే అవకాశం ఉంది. సుదర్శన్ ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో ఉన్నారు. ఆగస్టు 4న భారత జట్టుతో పాటు అతడు శ్రీలంక ప్రయాణించలేదు. సుదర్శన్ కాలి వేలి గాయం నుంచి కోలుకుంటు గంటకు పైగా నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. రాబోయే మూడు, నాలుగు రోజుల పాటు అతని పరిస్థితిని పర్యవేక్షించిన తర్వాతే.. అతను ఆడేందుకు అందుబాటులో ఉంటాడా లేదా అనే దానిపై తుది నిర్ణయం అధికారులు తీసుకుంటారు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చే ముందు అతను పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని నిర్ధారించుకోవడం ముఖ్యం" అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ టెస్ట్ సిరీస్?లో ఇండియా, శ్రీలంక మధ్య రెండు మ్యాచులు జరగనున్నాయి. ఆగస్ట్ 15 తొలి టెస్ట్, ఆగస్ట్ 23న రెండో టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్ కు వెళ్లాలంటే టీమిండియాకు ఈ సిరీస్ ఎంతో కీలకం. దీంతో ఎలాగైనా సిరీస్ గెలవాలని గిల్ సేన పట్టుదలతో ఉంది. మరోవైపు.. సొంతగడ్డపై ఇండియాను చిత్తు చేయాలని శ్రీలంక ఉవ్విళ్లూరుతోంది.

## ఇంగ్లాండ్ పౌరసత్వం పొందిన పాక్ క్రికెటర్ ఆమిర్.. ఐపీఎల్ 2027లో ఆడటంపై కీలక వ్యాఖ్యలు!

పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ అధికారికంగా ఇంగ్లాండ్ పౌరసత్వం (యుకే పౌరసత్వం) పొందడంతో ఆయన ఐపీఎల్ (ఖూూ)లో ఆడటంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. బ్రిటిష్ పాస్‌పోర్ట్ రావడంతో ఆమిర్ ఇప్పుడు ఇంగ్లాండ్ దేశవాళీ క్రికెట్‌తో పాటు 'ది హండ్రెడ్' టోర్నీలో ట్రెంట్ రాకెట్స్ తరఫున లోకల్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతున్నాడు.

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పాక్ ఆటగాళ్లపై ఐపీఎల్‌లో నిషేధం ఉన్నప్పటికీ... గతంలో పాకిస్థాన్ ఆల్‌రౌండర్ అజర్ మహమూద్ బ్రిటిష్ పౌరసత్వం పొంది కింగ్స్ ఎలెవెన్ పంజాబ్, కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే నిబంధనల ప్రకారం మహమ్మద్ ఆమిర్‌కు కూడా ఇంగ్లాండ్ ప్లేయర్‌గా ఐపీఎల్ వేలంలో పాల్గొనే అర్హత లభించింది. ఈ సందర్భంగా ఆమిర్ స్పందిస్తూ... "2027 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో నేను విదేశీ ప్లేయర్ గా ఆడతాను. ఇక ఐపీఎల్ విషయానికి వస్తే... నేను అందులో పాల్గొంటానో లేదో ఇప్పటికైతే నాకూ తెలియదు, ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు" అని స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి ఐపీఎల్ పాల్గొనడంపై ఎలాంటి ప్రణాళికలు ఖరారు చేయలేదని, ముందుగా ప్రస్తుతం ఆడుతున్న లీగ్‌లపైనే శ్రద్ధ పెట్టినట్లు తెలిపాడు.



Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776